
సాక్షి
బాపట్ల
మంగళవారం । 5 । ఆగస్టు । 2025



గ్రామదేవతల విగ్రహాల ప్రతిష్ట

నాదెండ్ల: తూబాడు గ్రామంలోని పోలేరమ్మ తల్లి దేవాలయ ప్రాంగణంలో సోమవారం గ్రామ దేవతలు అంకమ్మ తల్లి, పోర్ల అంకమ్మ తల్లి, పోతురాజు విగ్రహాలను ప్రతిష్టించారు.



పశ్చిమ డెల్టాకు నీరు విడుదల

దుగ్గిరాల: ప్రకాశం బ్యారేజీ నుంచి సోమవారం 8 వేల క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజీ వద్ద 12 అడుగులు నీటి మట్టం ఉంది.



నెమలిలో పవిత్రోత్సవాలు

తిరువూరు: నెమలి శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానంలో సోమవారం స్వామివారి పవిత్రోత్సవాలను ప్రారంభించారు. వేణుగోపాలుడికి ప్రత్యేక పూజలు చేశారు.

న్యూస్‌రీల్

ప్రారంభించిన 15 రోజులకే కుంగిన రోడ్డు



పెదకూరపాడు: జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ. కోటి 50 లక్షలతో నిర్మించిన రహదారి ప్రారంభించిన 15 రోజులకే కుంగిపోయింది. జూలై 18వ తేదీన రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చేతుల మీదుగా ఈ రహదారి ప్రారంభోత్సవం జరిగింది. ఇప్పుడీ రహదారి కంభంపాడు జలాలపురం మధ్య కుంగిపోయింది. నాసిరకం నిర్మాణానికి ఇదొక నిదర్శనంగా నిలిచింది.

గారపాడులో పంచలోహ విగ్రహాలు చోరీ




పెదకూరపాడు: గారపాడు గ్రామంలో ఆదివారం పంచలోహ విగ్రహాలు చోరీకి గురయ్యాయి. ఆలయ అర్చకులు గొట్టుముక్కల ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో పూజల నిర్వహించేందుకు ఆదివారం ఉదయం అర్చకులు తలుపులు తెరవగా స్వామివారి, అమ్మవారి కళ్యాణ పంచలోహ విగ్రహాలు కనిపించలేదు. దక్షిణం వైపు గేటు తాళాలు పగలగొట్టి ఉండటం గమనించి స్థానికులకు, ఆలయ కమిటీ సభ్యులకు సమాచారం అందించారు. పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. సీఐ పత్తిపాటి సురేష్, ఎస్సై గిరిబాబులు సంఘటన స్థలానికి చేరుకొని సోమవారం విచారించారు. క్లూస్ టీం ద్వారా ఆనవాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సురేష్ తెలిపారు.

నేడు ప్రభుత్వ ఉద్యోగుల ఛాయ్ పే చర్చ



నరసరావుపేట ఈస్ట్: ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఈ నెల 5వ తేదీన కలెక్టరేట్ ఆవరణలోని క్యాంటీన్ వద్ద 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం' కార్యక్రమం చేపడుతున్నట్టు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు స్వర్ణ చినరామిరెడ్డి తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన కార్యవర్గ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సంఘం రాష్ట్ర అధ్యక్ష్య, కార్యదర్శులు కే.ఆర్.సూర్యనారాయణ, రమేష్‌కుమార్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్టు వివరించారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు చుక్కా వెంకటేశ్వర్లు, కంపాల వెంకటేశ్వర్లు, షేక్.బాజీ, ఏ.భాగ్యమేరీ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ నృసింహస్వామి వారికి చైన్ బహుకరణ



మంగళగిరి: మంగళాద్రిలోని లక్ష్మీనృసింహ స్వామి వారికి విజయవాడకు చెందిన మంద్రు శ్రీనివాస్, భాగ్యశ్రీ దంపతులు రూ.లక్ష విలువైన పింక్ కలర్ రాయి చైన్‌ను బహూకరించారు. అలాగే రాజ్యలక్ష్మి అమ్మవారికి మంగళగిరి పట్టణానికి చెందిన మానుకొండ వీరభద్రరావు, శివపార్వతి దంపతులు రూ. లక్ష విలువైన తిరునామాలను అందజేశారు.

మృత్యుకుహరాలు గ్రానైట్ క్వారీలు

- మృతుల సంఖ్యను తక్కువగా చూపినట్లు ప్రచారం
- పచ్చనేత ఒత్తిళ్లు, నోట్ల కట్టలకు తలొగ్గినట్లు అధికారులపై ఆరోపణలు
- క్వారీల్లో కానరాని భద్రతా చర్యలు
- పొట్టకూటి కోసం వచ్చి విగత జీవులుగా మారుతున్న వైనం
- పట్టించుకోని పోలీసులు, మైనింగ్, కార్మిక శాఖలు
- ఇతర రాష్ట్రాల కార్మికులు కావడంతో ఖాతరు చేయని క్వారీ యజమానులు

బల్లికురవ దుర్ఘటనలో మృతుల సంఖ్యపై అనుమానాలు



తలకు హెల్మెట్ లేకుండా డ్రిల్లింగ్ చేస్తున్న కార్మికులు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: బల్లికురవ, సంతమాగులూరు ప్రాంతాల్లోని గ్రానైట్ క్వారీలు మృత్యుకుహరాలుగా మారాయి. పొట్టకూటి కోసం ఒడిశా, ఎంపీ, యుపీ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలకు చెందిన కార్మికులు వచ్చి క్వారీల్లో పనిచేస్తూ మృత్యువాత పడుతున్నారు. ఆర్గనైజర్ల ద్వారా పనిలోకి వస్తున్న కార్మికులు ప్రమాదాల్లో మృతి చెందినా యజమానులు బయటకు తెలియనీయడంలేదు. మృతుల వివరాలు తక్కువగా చూపి మృతదేహాలను మట్టిలో కప్పెడుతున్నారు. దీంతో తమవారు ఎక్కడున్నారో? ఎక్కడ పనిచేస్తున్నారో, అసలు ఏమయ్యారో కూడా వారి కుటుంబ సభ్యులకు తెలిసే అవకాశంలేదు. ఒకవేళ మృతుల వివరాలు తెలిసిన కార్మికులు ఉన్నా.. క్వారీల యజమానులు వారిని భయపెట్టి వివరాలు కుటుంబ సభ్యులకు చేరకుండా చూస్తున్నారు.

ప్రమాద ఘటనలో మృతులెందరు?

శనివారం జరిగిన బల్లికురవ మండలం కొనెదన రెవెన్యూలోని సత్యకృష్ణ క్వారీ ప్రమాదఘటనలో మృతుల సంఖ్యపై బాపట్ల, ప్రకాశం, పల్నాడు జిల్లాలో పెద్ద దుమారమే రేగింది. పచ్చనేత దివ్య రామాంజనేయులుకు చెందిన ఈ క్వారీలో జరిగిన ఘటనలో మృతుల సంఖ్య 15గా ఉందని కొందరు.. కాదు 16 మంది అని మరికొందరు అంతకు మించి ఉండవచ్చని ఇంకొందరు చెబుతున్నారు. వాస్తవానికి ప్రమాద సమయంలో ఆరు జాకీలు పనిచేస్తుండడంతో 18 మందికి తక్కువ లేకుండా ఉన్నారని కార్మిక వర్గాలు చెబుతున్నాయి. కానీ అధికారులు మొత్తం తొమ్మిది మంది మాత్రమే ఉన్నారని ప్రకటించారు. వారిలో ఆరుగురు మృతి చెందగా, ముగ్గురు గాయపడ్డట్లు తెలిపారు. కానీ నరసరావుపేట ఆసుపత్రిలో ఏడుగురు చికిత్స పొందుతున్నట్లు చూపారు. ముగ్గురు గాయపడితే ఏడుగురు ఎలా చికిత్స పొందుతారని కార్మిక సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఈ లెక్కన మృతుల సంఖ్య ఎక్కువ ఉండవచ్చని, ఆరుగురిని లెక్క చూపి మిగిలిన మృతదేహాలను క్వారీలోనే పూడ్చి పెట్టి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పొంతన లేని ప్రకటనలు

ప్రమాద ఘటనపై అధికారులు, పోలీసులు పరస్పర విరుద్ధమైన ప్రకటనలు చేశారు. క్వారీలో 12 మంది కార్మికులు మాత్రమే ఉన్నారని, ఆరుగురు మృతి చెందిగా ముగ్గురు గాయాలపాలయ్యారని, మరో ముగ్గురు సురక్షితంగా బయటపడ్డారని జిల్లా అధికారి, అధికారులు ప్రకటించారు. క్వారీలో తొమ్మిది మంది కార్మికులు ఉన్నారని, ఆరుగురు మృతి చెందగా ముగ్గురు గాయపడ్డారని అదేరోజు సాయంత్రం అద్దంకిలో సీఐ విలేకరులకు చెప్పారు. ఆదివారం నాటికి గాయపడినవారి సంఖ్య ఏడుకు పెరిగింది. పరస్పర విరుద్ధమైన ప్రకటనలతో మృతుల సంఖ్యపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చేతులు మారిన కోట్లు

క్వారీ ప్రమాదంలో పదిమందికి మించి కార్మికులు మృతి చెందితే లీజులు రద్దయ్యే అవకాశం ఉంది. దీంతో ప్రమాదంలో ఎక్కువ మంది మృతి చెందినా ఆరుగురు మాత్రమే మృతి చెందినట్లు చూపుతున్నట్లు సమాచారం. అధికారులు మృతుల సంఖ్యను మార్చిమార్చి చెప్పి ఎట్టకేలకు ఆరుగురుగా ప్రకటించారు. మిగిలిన వారిపై స్పష్టతనివ్వలేదు.

నిబంధనలకు పాతర

వాస్తవానికి క్వారీలో ఎటువంటి భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని తెలుస్తోంది. కార్మికులు పనిచేసేటప్పుడు వారికి భద్రతా పరంగా హెల్మెట్లు, బూట్లు ఇతర సామగ్రి ఇవ్వాలి. కార్మికులకు పర్యవేక్షకులుగా మేట్లు, ఫస్ట్‌క్లాస్ మేనేజర్ ఉండాలి. ఆదివారం సెలవు కావడంతో వారెవరు లేరని తెలుస్తోంది. అయినా ఆదివారంనాడు కార్మికులతో ఎలా పనిచేయించారో క్వారీ యజమానులు, అధికారులు చెప్పాలి. బల్లికురవ, సంతమాగులూరు పరిధిలో సుమారు 50 క్వారీలు ఉండగా ఒక్కొక క్వారీలో వందమంది చొప్పున 5 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో 60 నుంచి 70 శాతం మంది ఇతర రాష్ట్రాల కార్మికులు ఉన్నారు. క్వారీ ప్రమాదాల్లో గడచిన పదేళ్లలో 100 మంది మృతిచెందినట్లు సమాచారం.

క్షతగాత్రుల సంఖ్యను ఇష్టానుసారంగా ప్రకటించడం విమర్శలకు దారితీసింది. మంత్రి గొట్టిపాటి రవికుమార్ సొంత నియోజకవర్గం కావడంతో ప్రమాద ఘటన అనంతరం అధికారపార్టీ ముఖ్యనేతల జోక్యంతోపాటు రూ.కోట్లలోనే డబ్బులు చేతులు మారిన కారణంగానే అధికారులు మృతుల సంఖ్యను తక్కువ చేసి చూపించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అనాథ శవాలను తెచ్చినట్లు

క్వారీ ప్రమాద ఘటనలో ఒడిశా కార్మికులు మృత్యువాతపడ్డారు. క్వారీ యజమానులు మృతుల బాడీలను దుర్మార్గంగా డంపర్‌లో రాళ్లను తెచ్చినట్లు తెచ్చి అద్దంకి ఆసుపత్రిలో పడవేశారు. ఘటన చూపరుల హృదయాలను కలచివేసింది. స్థానిక కార్మికులైతే క్వారీ యజమానులు అంతటి సాహసానికి వడిగట్టేవారు కాదు. అనామకులైన కార్మికులు కాబట్టే ఏవిధంగా తెచ్చినా అడిగేవారు ఉండరని అనాథశవాలను తెచ్చినట్లు తెచ్చినా అధికారులు ఏమాత్రం స్పందించకపోవడంపై విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి.



కార్మికుల మృతదేహాలను డంపర్‌లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తున్న దృశ్యం

క్వారీలో ప్రమాదంపై మైన్స్ అధికారుల తనిఖీ



ప్రమాద వివరాలు తెలుసుకుంటున్న మైనింగ్ అధికారులు

బల్లికురవ: గ్రానైట్ క్వారీలో రాయి తీస్తుండగా ఆదివారం జరిగిన ఘోర ప్రమాదానికి సంబంధించి రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన మైన్స్ అండ్ సెఫ్టీ అధికారులు సోమవారం క్వారీలో తనిఖీ చేపట్టారు. బల్లికురవ సమీపంలోని ఈర్లకొండ సత్యకృష్ణ క్వారీలో రాయిపడి ఆరుగురు కార్మికులు మృతిచెందినట్లు, మొత్తం 16 మంది పనిచేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వెంకట మురళికి అధికారులు తెలిపారు. ప్రమాద ఘటనపై పుర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని మైనింగ్ శాఖకు కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలకు డీఎంస్ అశోక్ కుమార్, డీడీ ఎం జ్ఞానేశ్వర్, ఏడీ రామచంద్ర, ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, తహసీల్దార్ రవి నాయక్, ఒడిశా రాష్ట్రం నుంచి వచ్చిన సహాయ కమిషనర్ బృందం ప్రమాదం సంభవించిన క్వారీ ప్రాంతాన్ని పరిశీలించింది. ఆదివారం ఉదయం నుంచి క్వారీ నిర్వాహకులు కార్యాలయాలకు తాళాలు వేశారు.

అధికారుల రాకతో అప్పటికప్పుడు క్వారీ, పరిసర క్వారీల నిర్వాహకులతో ప్రత్యక్షమయ్యారు. అప్పటికి అప్పుడు హెల్మెట్లు తెప్పించుకుని తలలకు ధరించారు. కార్మికులు చనిపోయిన ప్రదేశంలో ఒక్క హెల్మెట్ గాని, షూ కాని కనిపించక పోవటంతో భద్రతా చర్యలు పాటించకపోవటం వల్లే ఘోర ప్రమాదానికి కారణంగా భావించారు. అనంతరం నరసరావుపేటలోని జీబీఆర్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న కార్మికులు ఎం సుదర్శన్ కె.నాయక్, శివా గౌడలను పరామర్శించి ప్రమాదానికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. పూర్తి నివేదికను తయారు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

స్వచ్ఛందంగా కదిలిన రైతులు

- అండగా నిలిచిన వైఎస్సార్ సీపీ నాయకులు
- కాలువల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూటికాడ తొలగింపు
- పనులను అడ్డుకునేందు కూటమి నాయకులు విఫల యత్నం
- రైతులు ప్రతిఘటించడంతో వెనుదిరిగిన కూటమి నేతలు



అద్దేపల్లి డ్రెయిన్‌లో గుర్రపు డెక్క తొలగిస్తున్న రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు

భట్టిప్రోలు (కొల్లూరు): కాలువల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించేందుకు రైతులు స్వచ్ఛందంగా కదిలారు. వైఎస్సార్ సీపీ నాయకులు వారికి అండగా నిలిచారు. పనులను అడ్డుకునేందుకు కూటమి నేతలు విఫలయత్నం చేశారు. అయితే రైతులు ప్రతిఘటించడంతోపాటు పోలీసుల జోక్యంతో కూటమి నేతలు వెనుదిరిగారు. అనంతరం భట్టిప్రోలు మండలం అద్దేపల్లి డ్రెయిన్‌లో గుర్రపు డెక్క తొలగింపు పనులు సోమవారం కొనసాగాయి.

ప్రాణాలకు తెగించి పోరాడుతున్న వరికూటి

గుర్రపు డెక్క కారణంగా ఏడాది కాలంగా పంటలు కోల్పోతున్నామంటూ రైతులు వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు వద్ద మొరపెట్టుకున్నారు. స్పందించిన ఆయన పదిహేను రోజుల కిందట తొలిసారి అద్దేపల్లి – గూడవల్లి డ్రెయిన్‌ను పరిశీలించారు. గుర్రపు డెక్క, తూటికాడలతో నిండిపోయిన డ్రెయిన్‌లో పనులు చేపట్టాలని కోరుతూ కాలువలో దిగి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పది రోజుల వ్యవధిలో పనులు చేపట్టని పక్షంలో అదే ప్రాంతంలో ధర్నా చేపడతామని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం స్పందించకపోవడంతో వరికూటి చివరకు డ్రెయిన్ వద్దే బైఠాయించి ఆందోళన చేపట్టారు. దీంతో ఆ ప్రాంతానికి చేరుకున్న డ్రెయినేజీ విభాగం అధికారులు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కూటమి ప్రజాప్రతినిధులు అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో మిన్నకుండిపోయారు. దీనిపై ప్రశ్నించేందుకు వరికూటి రేపల్లెలోని కార్యాలయానికి చేరుకున్నారు. దీనిపై అధికారుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ఆ కార్యాలయం ఎదుట నిరాహారదీక్షకు దిగారు. కూటమి నాయకుల ఒత్తిడితో పోలీసులు ఆయనను బలవంతంగా పోలీసుస్టేషన్‌కు తరలించి విచక్షణారహితంగా దాడి చేశారు. నాలుగు రోజులుగా రేపల్లె ప్రభుత్వ వైద్యశాలలో నిరవధిక నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. వరికూటి ఆరోగ్య పరిస్థితి విషమించింది. అయినా ప్రభుత్వం స్పందించ లేదు. మొండిగా వ్యవహరిస్తున్న ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు నిర్ణయించుకున్నారు. స్వచ్ఛందంగా గుర్రపు డెక్క, తూటికాడ తొలగింపు పనులు చేపట్టారు.



భట్టిప్రోలు మండలం అద్దేపల్లి డ్రెయిన్‌లో భారీగా పేరుకుపోయిన గుర్రపు డెక్క

పనులను అడ్డుకునేందుకు కూటమి నాయకుల యత్నాలు

రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు చేపట్టిన గుర్రపు డెక్క పనులను కూటమి నాయకులు అడ్డుకునేందుకు ప్రయత్నం చేశారు. రైతులు, వైఎస్సార్ సీపీ నాయకుల నుంచి ప్రతిఘటన ఎదురుకావడంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు జోక్యం చేసుకున్నారు. కూటమి నాయకులను అక్కడ నుంచి వెనక్కి పంపారు. అనంతరం తూటికాడ, గుర్రపు డెక్క తొలగింపు పనులు కొనసాగాయి. పొక్లెయిన్‌కు తోడు అప్రాంత రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు కాలువలో దిగి గుర్రపుడెక్క, తూటికాడ తొలగించారు.

సైబర్ వలలో సామాన్యులు

- మాయమాటలతో ట్రాప్
- పలు రకాలుగా ఫోన్లు
- నమ్మితే ఖాతాలో నగదు మాయం

చీరాల: వేటపాలెం మండలం దేశాయిపేట పంచాయతీలోని దంతంపేటకు చెందిన ఓ యువకుడు హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. అతని వాట్సప్‌కు వచ్చిన మెసేజ్ క్లిక్ చేసి చూడగా అందులో ఉన్న ఓ ప్రొడక్ట్‌ను క్లిక్‌చేసి స్క్రీన్ షాట్ తీసి పంపించాలని ఉంది. అతడు అలానే చేయగా ముందుగా రూ.150 బ్యాంకు ఖాతాకు జమ చేశారు. ప్రొడక్ట్‌లను క్లిక్‌చేస్తే టాస్క్‌లు వస్తాయని నమ్మబలికారు. నగదు జమ అవుతుందని భావించిన అతడు వారు చెప్పినట్లుగా చేశాడు. చిన్నచిన్న అమౌంట్‌లను సైబర్ నేరగాళ్లు అతని అకౌంట్‌లో జమ చేశారు. బాధితుడు పూర్తిగా వారిని నమ్మాడని నిర్ణయించుకుని తర్వాత విడతల వారీగా రూ.10 లక్షల వరకు దోచుకున్నారు.

- వేటపాలెం మండలం కొత్తపేటకు చెందిన ఓ వ్యక్తి ఇంజినీరింగ్ కాలేజీలో అధ్యాపకుడిగా పని చేస్తున్నాడు. సైబర్ నేరగాళ్లు అతనికి ఒక లింక్ పంపించి క్లిక్ చేస్తే ప్రైజ్‌మనీ వస్తుందని మభ్యపెట్టారు. కొంత నగదు అకౌంట్‌లో జమ కావడంతో నకిలీ వెబ్‌సైట్ ద్వారా బ్యాంకు ఖాతా నుంచి రూ.30 లక్షలు కాజేశారు.
- చీరాల పట్టణంలో ఓ అంగన్‌వాడీ కార్యకర్తకు హెల్త్ డిపార్టుమెంట్ పేరుతో కాల్ వచ్చింది. గర్భిణులకు, బాలింతలకు జననీ సురక్ష కింద ముఖ్యమంత్రి రూ.15 వేలు ఇస్తున్నారని అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని లబ్ధిదారుల ఫోన్ నెంబర్లు ఇవ్వాలని కోరడంతో ముగ్గురి నెంబర్లు ఇచ్చారు. ఆ తర్వాత ముగ్గురికి కాల్ చేసిన సైబర్ నేరగాళ్లు వాట్సప్ పే ద్వారా ముగ్గురి అకౌంట్ల నుంచి రూ.1.70 లక్షలు కాజేశారు.
- వేటపాలెం మండలం పాపాయిపాలేనికి చెందిన ఓ వ్యక్తికి గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి యాక్సిడెంట్ ఫొటోలు వాట్సప్‌లో వచ్చాయి చూడమని చెప్పాడు. దీంతో ఏం జరిగిందోనని అతడు వాట్సప్‌లో చూడగా ఫొటోలు కనిపించలేదు. కొద్ది నిమిషాల్లో అతని బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు డెబిట్ అయినట్లుగా మెసేజ్‌లు వచ్చాయి. విడతల వారీగా రూ.5.72 లక్షలు డెబిట్ అయ్యాయి. ఇవన్నీ కొంత కాలంగా చీరాల నియోజకవర్గంలో జరిగి వెలుగులోకి వచ్చిన ఘటనలు. ఇలా ఎంతో మంది సైబర్ మోసాలకు బలవుతున్నారు. కొందరు తమకు జరిగిన మోసంపై మిన్నకుండిపోతున్నా మరి కొందరు పోలీసులను ఆశ్రయిస్తున్నారు.



సైబర్ నేరాల పట్ల అప్రమత్తతగా ఉండాలి..

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. తెలియని నెంబర్ల నుంచి కాల్స్ వచ్చినా, లింక్‌లు పంపినా వాటిని తెరవవద్దు. లింక్‌పై క్లిక్ చేస్తే ఖాతాదారుని వివరాలను హ్యాక్ చేసి ఖాతాలోని నగదు మాయం చేస్తారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం పిన్, ఓటీపీలు ఎవరితోనూ షేర్ చేయవద్దు.బ్యాంకు మేనేజర్లతో సమావేశం నిర్వహించాం. సైబర్ నేరాల పట్ల ప్రజలకు కూడా అవగాహన కల్పిస్తున్నాం.

– ఎం.మోయిన్, డీఎస్పీ, చీరాల

నిరక్షరాస్యులు మొదలుకొని..

ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం కొంత పుంతలు తొక్కుతోంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని కొత్త ఆవిష్కరణలు జరుగుతున్నాయి. ఇదే సాంకేతికతను ఉపయోగించుకుని సైబర్ నేరగాళ్లు సామాన్యుల ఖాతాలు ఖాళీ చేస్తున్నారు. నిరక్షరాస్యులతోపాటు టీచర్లు, ఉద్యోగులు, వ్యాపారులు సైతం మోసపోయి చివరకు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. సైబర్ నేరాలకు పాల్పడే వాళ్లు ఎక్కువగా ఇతర రాష్ట్రాల నుంచి ఫోన్లు చేస్తున్నారు. మోసపోయిన వారు ఫిర్యాదు చేసినప్పటికీ నిందితులు ఇక్కడి వారు కాకపోవడంతో గుర్తించడం కష్టతరమని పోలీసులు చెప్తున్నారు.

కొత్త పుంతలు తొక్కుతున్నారు...

బ్యాంక్ అకౌంట్ బ్లాక్ అయిందని, ఏటీఎం యాక్టివేషన్ చేయాలని బ్యాంకు నుంచి ఫోన్లు చేస్తున్నట్లుగా చేసి ఖాతాదారుని వివరాలు సేకరిస్తున్నారు. ఫేక్ ప్రొఫైల్ ఫొటోను మార్ఫింగ్ చేసి స్నేహితులు, బంధువులకు ఫేక్ మెసేజీలు పంపుతున్నారు. ఫేస్‌బుక్‌లో స్నేహితులు, బంధువులు అడిగినట్లుగా నగదు పంపించాలంటూ మెసేజ్‌లు రావడంతో నిజమేనని అనుకొని కొందరు నగదు బదిలీ చేసిన సంఘటనలు ఉన్నాయి. ఎవరిని అడగాలో ఏంచేయాలో తెలియక లబోదిబోమంటున్నారు.

రైతన్నను నట్టేట ముంచిన కూటమి ప్రభుత్వం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున
- బ్లాక్‌మార్కెట్‌లోకి ఎరువులు
- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత



జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళికి వినతి పత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున, మాజీ డెప్యూటీ స్పీకర్ కోన

బాపట్ల:కూటమి ప్రభుత్వం రైతులను నట్టేటా ముంచిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున పేర్కొన్నారు. రైతు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ప్రజా సమస్యల పరిష్కారవేదికలో జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళికి వినతి పత్రం అందించారు. నాగార్జున మాట్లాడుతూ రైతు సమస్యలను పరిష్కరించటంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. రైతులు పండించిన పంటను కొనుగోలు చేసే నాథుడే లేరన్నారు. ధాన్యంకు గిట్టుబాటు ధర లేదు, పొగాకు రైతులు ఇప్పట్లో కోలుకునే పరిస్థితి లేదన్నారు. రైతులకు ఎరువులు దొరకకుండా బ్లాక్‌మార్కెట్‌లోకి వెళ్లే పరిస్థితి నెలకొందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు రైతులను ఆదుకునేందుకు ఆర్బీకే వ్యవస్థను రూపొందించారని గుర్తు చేశారు. ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయటంతోపాటు ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. వ్యవసాయం దండగా అన్న చంద్రబాబునాయుడు మళ్లీ అదే ధోరణిలో ఉన్నారని తెలిపారు. రైతులకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఏటా రూ.13,500 ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చినా ఆ దిశగా చర్యలు లేవన్నారు. రైతులకు అండగా ఉండేందుకు వైఎస్సార్ సీపీ సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి, పర్చూరు సమన్వయకర్త గాదె మధుసూదనరెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు మోదుగుల బసవపున్నారెడ్డి, చేజర్ల నారాయణరెడ్డి, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, మరుప్రోలు ఏడుకొండలరెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల:ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని, అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 205 వినతులు అందగా, వారు పలు సమస్యలకు తక్షణమే పరిష్కారమార్గం చూపాలని ఆదేశించారు. ప్రజా సమస్యల దరఖాస్తులపై స్పందించి, దరఖాస్తుదారులతో మాట్లాడి వారి సమస్యను పరిష్కరించి ఎండార్‌మెంట్ ఇవ్వాలని సూచించారు.

క్లుప్తంగా

వైన్ షాప్ సమీపంలో మృతదేహం



మార్టూరు: మండలంలోని ద్రోణాదుల గ్రామంలోని వైన్స్ షాప్ సమీపంలో సోమవారం ఉదయం ఒక పురుషుని మృతదేహం గుర్తించారు. అందిన వివరాల మేరకు.. ద్రోణాదుల నుంచి బొబ్బేపల్లి వెళ్లే మార్గంలో ఉన్న నేల చట్ట పక్కన ముళ్ల పొదలలో పురుషుడి మృతదేహాన్ని సోమవారం ఉదయం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల విచారణలో మృతుడు ఇంకొల్లు మండలం నాగండ్ల గ్రామానికి చెందిన మురికిపూడి విజయ్ (65)గా గుర్తించి మృతదేహాన్ని మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడు విజయ్ రెండు రోజులుగా స్థానిక వైన్స్ షాప్ సమీపంలో మద్యం తాగుతూ అక్కడే సంచరిస్తున్నట్లు విపరీతమైన దాహార్తితో కానీ గుండె నొప్పితో కానీ మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తిమృతి



చీరాల రూరల్: రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం చీరాల–స్టూవర్టుపురం రైల్వేస్టేషన్ల మధ్యగల ఈపురుపాలెం స్ట్రయిట్‌కట్ కాలువ సమీపంలో చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్సై సీహెచ్ కొండయ్య వివరాల మేరకు.. ఈపురుపాలెం స్ట్రయిట్‌కట్ కాలువ సమీపంలో ఉదయం ఏడు గంటల సమయంలో రైలు బండిని గమనించకుండా రైలు పట్టాలు దాటుతున్న గుర్తు తెలియని వ్యక్తిని రైలుబండి ఢీట్టింది. ఈఘటనలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు చెప్పారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుని వయస్సు 28 సంవత్సరాలు ఉంటాయని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గూడ్స్ రైలు ఢీకొని వృద్ధుడి మృతి

నరసరావుపేట టౌన్: రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు గూడ్స్ రైలు ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందినట్లు ఇన్‌చార్జి రైల్వే ఎస్‌ఐ రమేష్‌బాబు సోమవారం తెలిపారు. నరసరావుపేట నుంచి మునుమాక వెళ్లే రైలు మార్గంలో ఆదివారం గుంటూరుకు చెందిన పెండెం సాయిబాబు(65) పట్టాలు దాటుతుండగా ఆ సమయంలో వచ్చిన గూడ్స్ రైలు ఢీకొంది. సంఘటనలో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని సోమవారం బంధువులకు అప్పగించారు.

అంగన్‌వాడీలకు 'యాప్'సోపాలు

- పనికంటే యాప్‌లో నమోదే ఎక్కువ
- పనిచేయని సర్వర్లు
- యాప్‌లతో సతమతమవుతున్న అంగన్‌వాడీలు
- యాప్‌ల భారం మోయలేమంటూ ఫోన్లు అప్పగింత

అంగన్‌వాడీ కార్యకర్తలపై యాప్‌ల భారం పెరిగిపోతోంది. ప్రతి పనిని యాప్‌లలో నమోదు చేయాల్సి ఉంది. టెన్త్ విద్యార్హతతో అంగన్‌వాడీ టీచర్లుగా చేరే వారే ఎక్కువగా ఉంటారు. వీరికి స్మార్ట్‌ఫోన్ వినియోగంపై అవగాహన తక్కువగా ఉంటుంది. వారు యాప్‌లను సక్రమంగా వినియోగించలేకపోతున్నారు. దీనికి తోడు సర్వర్ లేకపోవడం, ఇచ్చిన ఫోన్లు పనిచేయకపోవడంతో అంగన్‌వాడీలు యాప్‌లతో ఆపసోపాలు పడుతున్నారు.



యాప్‌ల భారం తమపై మోపవద్దంటూ సీపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీలు

చీరాల అర్బన్: జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు తొమ్మిది ఉన్నాయి. వీటిలో 1888 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆరు నెలల నుంచి ఆరేళ్ల వరకు ఉన్న చిన్నారులు 69,217 మంది ఉన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషణ అందించడంతోపాటు గర్భిణులకు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వారి ఆరోగ్య సంరక్షణకు అవసరమైన పోషణ అందించడంలో వీరి పాత్ర ఎంతో ఉంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో కొత్తగా యాప్‌లు తీసుకువచ్చారు. అందుకు వీలుగా స్మార్ట్‌ఫోన్లను అంగన్‌వాడీలకు అందించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు పోషణ సరఫరాలో ప్రత్యేక యాప్‌లలో పలుమార్లు నమోదు చేయాల్సి ఉంది. కేంద్రాల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన బాల సంజీవిని యాప్, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పోషణ ట్రాకర్ యాప్‌తో కార్యకర్తలు అవస్థలు పడుతున్నారు. పోషణ్ ట్రాకర్ యాప్‌లో ముఖ గుర్తింపు వ్యవస్థ (ఎఫ్ఆర్ఎస్)/బయోమెట్రిక్ తప్పనిసరి కావడంతో నెట్‌వర్క్ సరిగా పనిచేయకపోయినా, లబ్ధిదారుల మొబైళ్లలో మెసేజ్ బ్యాలెన్స్ లేక ఓటీపీలు రాకపోయినా సరుకులు అందించలేని పరిస్థితి ఉంది.

యాప్‌లే యాప్‌లు

అంగన్‌వాడీలతోపాటు లబ్ధిదారులు కూడా యాప్‌ల వల్ల ఇబ్బందులు పడుతున్నారు. పోషణ్ ట్రాకర్ యాప్‌లో గర్భిణి, బాలింత, టీహెచ్ పిల్లల వివరాలు నమోదుతోపాటు వారికి ఎఫ్ఆర్ఎస్, ఈకేవైసీ, ఆధార్ ఫేస్ మ్యాచింగ్ చేయాలి. కొంత మంది లబ్ధిదారులు ఎప్పుడో చిన్న వయస్సులో ఉన్న ఫొటోతో ఆధార్ కార్డులతో ఇప్పుడు పోషణ ట్రాకర్ యాప్‌లో చేసుకునేందుకు అవకాశం లేదు. దీంతో ఆధార్ అప్‌డేట్ చేయాల్సి ఉంది. గతంలో ఇచ్చిన ఫోన్లు సహకరించకపోవడంతో సొంత ఫోన్లలో సిమ్‌లు వేసుకుని పనిచేయాల్సి వస్తుంది. ప్రతి నెలా కేంద్రాలకు పాలు సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన మిల్క్ యాప్, రాష్ట్ర ప్రభుత్వం మూడో శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కోసం ఉన్న యాప్‌లో ఫొటోలు అప్‌లోడ్ చేయలేకపోతున్నారు. ఇప్పటి వరకు ఏఎన్ఎంలు చేసే మాతృవందన పథకానికి సంబంధించిన యాప్ త్వరలో అంగన్‌వాడీలకు అప్పగించనున్నారు. ఇప్పటికే ఉన్న యాప్‌లతో అవస్థలు పడుతుంటే మరో యాప్‌ను అప్పగించడంపై అంగన్‌వాడీలు ఆపసోపాలు పడుతున్నారు.

బోధన తగ్గి.. పనిభారం పెరిగి..

ప్రస్తుతం అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆయా కేంద్రాలలో 15 వరకు రికార్డులు నిర్వహిస్తున్నారు. లబ్ధిదారులకు అందించే ఆహార వినియోగం, పిల్లలకు, బాలింతలకు, గర్భిణుల నమోదు, ప్రీస్కూల్ అడ్మిన్ రికార్డులను ప్రతిరోజూ విధిగా నమోదు చేయాలి. మరోవైపు పిల్లల టీకాల రికార్డులు, విటమిన్–ఎ రికార్డు, రిఫరల్ సర్వీసెస్, గృహ సందర్శన రికార్డులు, నెలవారీ ప్రాజెక్టులు, హౌస్‌హోల్డ్ సర్వే రికార్డు, గ్రోత్ చార్ట్ తదితర రికార్డులు నమోదు చేయాల్సి ఉంది. దీంతో పిల్లలకు ప్రీస్కూల్ బోధన అటకెక్కుతుంది.

ఇచ్చేది గోరంత.. పని కొండంత

అంగన్‌వాడీ టీచర్లకు ఇచ్చే జీతం కంటే పని భారం అధికంగా ఉంది. మెయిన్ అంగన్‌వాడీ కార్యకర్తకు నెలకు రూ.11,500, మినీ అంగన్‌వాడీ కార్యకర్తకు నెలకు రూ.7 వేలు, ఆయాలకు రూ.7 వేలు గౌరవవేతనం అందిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రాల నిర్వహణ, లబ్ధిదారులకు పోషకాహారం సరఫరా చేసేందుకు తీసుకువచ్చిన యాప్‌లతో విసిగిపోతున్నారు. యాప్‌ల భారం తమపై మోపవద్దంటూ ఇప్పటికే పలుమార్లు నిరసనలు చేశారు. యాప్‌ల భారం తమపై వేయవద్దంటూ వేటపాలెం ప్రాజెక్టు సీడీపీఓ రూనీస్‌కి వినతిపత్రం అందించారు. ప్రాజెక్టు పరిధిలో 270 అంగన్‌వాడీ కేంద్రాలుండగా 150 మంది అంగన్‌వాడీలు పనిచేయని ఫోన్లు తమకు వద్దంటూ సోమవారం ఐసీడీఎస్ కార్యాలయాలకు అప్పగించారు.



ఐసీడీఎస్ కార్యాలయానికి అప్పగించిన ఫోన్లు

డేటా నమోదు చేయలేక అవస్థలు పడుతున్నాం..

కేంద్రాల నిర్వహణకు ప్రవేశపెట్టిన యాప్‌లు మొరాయించడం, సర్వర్లు పనిచేయకపోవడంతో నిత్యం ఫోన్లతో ఇబ్బందులు పడుతున్నాం. దీంతో ఒత్తిడికి లోనవుతున్నాం. తక్కువ వేతనం ఇస్తూ పలు రకాల యాప్‌లతో తీవ్రమైన పని ఒత్తిడి పెరుగుతుంది. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు కేంద్రాల నిర్వహణకు గతంలో ఇచ్చిన ఫోన్లను ప్రాజెక్టు కార్యాలయాలలో అప్పగిస్తున్నాం.

– ఎలిజిబెత్ రేఖా, జిల్లా కార్యదర్శి, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

రైతు పక్షాన నిలబడితే కేసులు పెడతారా?

- అధికారుల ఆగడాలను ప్రత్యేక యాప్‌లలో నమోదు చేస్తున్నాం
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరెడ్డి



వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కారుమూరి వెంకటరెడ్డి

రేపల్లె: రైతు సమస్యలను రాజకీయం చేయడం కూటమి ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కారుమూరి వెంకటరెడ్డి పేర్కొన్నారు. రేపల్లె ప్రభుత్వ వైద్యశాలలో నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న వరికూటి అశోక్‌బాబును సోమవారం ఆయన పరామర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాల వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయమైన సమస్య పరిష్కారం కోసం శాంతియుతంగా నిరసన చేస్తున్న అశోక్ బాబును అక్రమంగా అరెస్టు చేసి పిడిగుద్దులతో దాడి చేశారన్నారు. కాలువలు పూడికలు తీయించలేని దిక్కుమాలిన స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ క్యాడర్‌పై పట్టణ సీఐ మల్లికార్జునరావు తీరు వివాదాస్పదంగా ఉందని, భవిష్యత్‌లో ఆయన తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ప్రజలపై అధికారులు, కూటమి నేతలు చేస్తున్న ఆగడాలను నమోదు చేసేందుకు ప్రత్యేక యాప్‌ను రూపొందించామన్నారు. మంత్రి అనగాని అండదండలతో పోలీసు అధికారులు బ్రోకర్ పనులు చేస్తున్నారని విమర్శించారు. అశోక్‌బాబు ఆరోగ్యం క్షీణించిందని, పోలీస్ కస్టడీలో అశోక్‌బాబు ఉన్నాడంటూ వైద్యశాల సిబ్బంది డిశ్చార్జి చేయడం లేదన్నారు. అశోక్‌బాబును వేరే ఆసుపత్రికి తీసుకెళితే తమ కస్టడీ నుంచి పరారయ్యాడని మరో అక్రమ కేసు బనాయించే కుట్రలో పోలీసులు ఉన్నట్లు తెలుస్తోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు తక్షణమే స్పందించి సమస్య పరిష్కారానికి హామీనివ్వటంతో పాటు అశోక్‌బాబుతో దీక్ష విరమింపజేయాలని డిమాండ్ చేశారు.

కలెక్టర్ ఆదేశించినా పెన్షన్ ఇవ్వని అధికారులు

ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శుల దోబూచులాట.



విలేకరులతో మాట్లాడుతున్న బాధితులు అమరయ్య, అచ్చయ్య

మార్టూరు: సాక్షాత్తూ జిల్లా కలెక్టర్ ఆదేశించినా బాధితులకు పెన్షన్ ఇవ్వకుండా నాటకాలు ఆడుతున్న ఇద్దరు అధికారుల వైనం మార్టూరు మండలం కోనంకి గ్రామంలో చోటుచేసుకుంది. బాధితులు, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శుల వివరాల మేరకు.. మండలంలోని కోనంకి గ్రామం నియోజకవర్గ ఎమ్మెల్యే ఏలూరి స్వగ్రామం. ఈ గ్రామంలో గత ప్రభుత్వ హయాం నుంచి 27 మంది డప్పు, చర్మ కళాకారులుగా పెన్షన్ తీసుకుంటున్నారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన తాళ్లూరి అచ్చయ్య, తాళ్లూరి అమరయ్య అనే ఇద్దరు వ్యక్తులకు పంచాయతీ కార్యదర్శి నక్క సుధాకర్ ఈనెల మూడో తేదీ వరకు పెన్షన్ ఇవ్వలేదు. మార్టూరు ఎంపీడీవో వై శ్రీనివాసరావుకు బాధితులు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోవడంతో నాలుగో తేదీ సోమవారం బాధితులు జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళికి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు.

ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్..

బాధితుల ద్వారా వివరాలు తెలుసుకున్న కలెక్టర్, ఎంపీడీవో శ్రీనివాసరావుకు ఫోన్ చేసి 27 మందికి పెన్షన్ రాగా ఇద్దరికీ ఇవ్వకపోవడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈరోజే వారికి వచ్చిన పెన్షన్ అందజేయాలని ఎంపీడీవోని ఆదేశించగా బాపట్ల నుంచి మార్టూరు వచ్చిన బాధితులు ఎంపీడీవోని కలిశారు. కోనంకి పంచాయతీ కార్యదర్శి సుధాకర్‌కు ఫోన్ చేసిన ఎంపీడీవో ఇద్దరికీ పెన్షన్ ఇవ్వాలని చెప్పి పంపించారు. పెన్షన్ కోసం పంచాయతీ కార్యాలయానికి వచ్చిన అచ్చయ్య, అమరయ్యలను సుధాకర్ సుమారు రెండు గంటల పాటు కూర్చోబెట్టి పెన్షన్ ఇవ్వకుండానే పంపించి వేశారు. పంచాయతీ కార్యదర్శి సుధాకర్ ఏమంటున్నాడంటే.. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి సుధాకర్‌ను విలేకరులు వివరణ కోరగా అచ్చయ్య, అమరయ్యలు ఇద్దరు సంబంధిత వృత్తి చేయడం లేదని సోమవారం కలెక్టర్‌కు స్థానికులు ఫిర్యాదు చేశారని, అందుకని పెన్షన్ ఇవ్వలేదన్నారు. ఫిర్యాదు ఎవరు చేశారో చెప్పలేకపోయిన సుధాకర్ మొత్తం 27 మందిపై ఫిర్యాదు చేశారని.. దర్యాప్తు చేసి నిర్ధారించుకున్నాకే పెన్షన్ ఇస్తానని, అందుకు ఎంపీడీవో కూడా ఇవ్వవద్దని అన్నట్లుగా చెప్పారు.

మీరుమీరు చూసుకోండన్న ఎంపీడీవో..

ఇదే విషయాన్ని ఎంపీడీవో శ్రీనివాసరావును వివరణ కోరగా కాన్ఫరెన్స్ కాల్‌లో సెక్రటరీ సుధాకర్‌తో మాట్లాడారు. పెన్షన్ ఇవ్వవద్దని నేను అనలేదు కదా.. వచ్చిన పెన్షన్ ఇచ్చి తరువాత విచారణ ఉంటే చేసుకోమని చెప్పాను కదా అంటూ ఎంపీడీవో బదులిచ్చాడు. ఆ తర్వాత ఎంపీడీవో సుధాకర్ మీడియా ప్రతినిధులు ఇద్దరినీ ఉద్దేశించి మీరు మీరు చూసుకోండి అని చెప్పడం గమనార్హం. జిల్లా కలెక్టర్ ఆదేశించినా కింది అధికారులు పెన్షన్ ఇవ్వకపోవడం ఏంటని, 27 మందిపై ఫిర్యాదు ఉంటే అందరికీ పెన్షన్ ఆపి దర్యాప్తు చేయాలి కానీ 25 మందికి పెన్షన్ ఇచ్చి ఇద్దరికీ ఆపటం ఏంటని బాధితులు అచ్చయ్య అమరయ్య వాపోతున్నారు.

అట్టహాసంగా పోలేరమ్మ జాతర

ఆకట్టుకున్న పెద్దలు, చిన్నారుల నృత్యాలు



పోటెత్తిన భక్తులు

బాపట్ల అర్బన్: బాపట్ల పట్టణంలోని రామకృష్ణాపురంలో ఉన్న మహాలక్ష్మి అమ్మవారి చెట్టు వద్ద మూడోరోజు పోలేరమ్మ కొలుపులు సోమవారం ఘనంగా జరిగాయి. మొదటి రోజు ఆడపడుచులు అందరూ కలిసి అమ్మవారికి పొంగళ్లు సమర్పించి మొక్కులు చెల్లించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అభిషేక మహోత్సవాన్ని వీక్షించడానికి, అమ్మవారి కృపకు పాత్రులు కావడానికి దూర ప్రాంతాల్లో నివసించే వారితోపాటు చుట్టూ పక్కల గ్రామ ప్రజలు హాజరయ్యారు. పోలేరమ్మ జాతర మహాలక్ష్మి గుడిని పూలు, విద్యుత్ దీపాలతో అలకరించారు. కోలాట ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. సుమారు 20 మంది పాటలతో లయబద్ధంగా నాట్య ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో నాదెండ్ల రాంబాబు, పేరాల నాగేశ్వరరావు, కొన్నె వెంకటేశ్వర్లు, నామేపల్లి లక్ష్మీనారాయణ, శంభవరపు రాంబాబు, పెద్ద వెంకట్రావు, చిన్న వెంకటరావు, మణి, శరత్, మహేష్, వినుకొండ శ్రీను, కొండవీటి శ్రీను,సాంబ, పత్తిపాటి సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధిలో ఉపాధ్యాయులు కీలకం

రాష్ట్ర పాఠశాలల పరిశీలన బృందం సభ్యుడు రమేష్



విద్యార్థుల ప్రమాణాలను పరిశీలిస్తున్న పరిశీలకులు రమేష్

పర్చూరు(చినగంజాం): పాఠశాల అభివృద్ధిలో ఉపాధ్యాయులు భాగస్వామ్యులు కావాలని రాష్ట్ర పాఠశాలల పరిశీలన బృందం సభ్యుడు, డైట్ లెక్చరర్ పీ రమేష్ అన్నారు. పర్చూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పాఠశాలల్లో విద్యాభివృద్ధి పరిశీలనలో భాగంగా ఆయన సోమవారం సందర్శించారు. పాఠశాలలో వివిధ తరగతులు అభివృద్ధి, పాఠశాలలోని రికార్డుల నిర్వాహణ, అకడమిక్ అంశాలు, పిల్లల హాజరు, వారిలో విద్యాభివృద్ధి, పాఠశాల పరిసరాలు, మధ్యాహ్న భోజనం అమలు, అందుకు సంబంధించిన వివిధ అంశాలను పరిశీలించారు. ముందుగా ఆయన పాఠశాల ప్రార్థనా సమయానికి వచ్చి పిల్లలు యూనిఫాం నిర్వహణ, క్రమశిక్షణ అమలు తీరును పరిశీలించారు. మధ్యాహ్న భోజన సమయంలో ఆయన స్వయంగా భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. 1వ తరగతి నుంచి మొదలుకొని అన్ని తరగతులను పరిశీలించారు. పాఠశాలలోని ఉపాధ్యాయులకు వివిధ సూచనలు చేశారు. భవిష్యత్‌లో పాఠశాలను సందర్శిస్తామని విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలను మెరుగు పరచుకునేందుకు చర్యలు తీసుకోవాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ–1 ఏ.శివ కోటేశ్వరరావు, ఎంఈఓ–2 పీ.వెంకటరామయ్య, పాఠశాల హెచ్‌ఎం ఎం. నాగిరెడ్డి, పీ. నాగమణి, సీఆర్‌ఎంటీలు ఏ. ఉమావెంకట మహేశ్వరరావు, సాయికుమార్ పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి ఫ్లోర్ బాల్ పోటీలు



బాలుర అండర్–14 విజేత నరసరావుపేట జట్టు

నరసరావుపేట ఈస్ట్: గుంటూరు రోడ్డులోని కే–రిడ్జి ఇంటర్నేషనల్ స్కూల్‌లో రెండురోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్–14, అండర్–19 బాల బాలికల ఫ్లోర్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలు సోమవారం ముగిశాయి. పోటీల్లో 16 జిల్లాల నుంచి బాలబాలికల జట్లు పాల్గొన్నాయి. పోటీల విజేతల వివరాలను పాఠశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.సురేంద్ర ప్రకటించారు. బాలికల అండర్–14 విభాగంలో తిరుపతి జిల్లా జట్టు ప్రథమస్థానం కై వసం చేసుకోగా, శ్రీసత్యసాయి జిల్లా రెండవ స్థానం, కర్నూలు, అనంతపురం జిల్లాలు సంయుక్తంగా మూడవ స్థానంలో నిలిచాయి. అలాగే అండర్–19 విభాగంలో తిరుపతి ప్రథమస్థానం సాధించగా, కృష్ణా, పల్నాడు జిల్లాలు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. బాలుర అండర్–14 విభాగంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రథమ స్థానం సాధించగా, పల్నాడు, కర్నూలు జిల్లాలు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. అండర్–19 విభాగంలో కృష్ణా జిల్లా ప్రథమ స్థానం కై వసం చేసుకోగా, తిరుపతి, పల్నాడు జిల్లాలు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి.

– ఫ్లోర్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జోసఫ్ మాట్లాడుతూ, పోటీలో పాల్గొన్న క్రీడాకారుల నుంచి రాష్ట్ర జట్టుకు కొందరు పేర్లు ఎంపిక చేశామన్నారు. తిరిగి వారి ప్రతిభను పరిశీలించి తుది జట్టును ప్రకటిస్తామన్నారు. రాష్ట్రజట్టుకు ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబర్‌లో బిహార్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విజేతలకు పాఠశాల చైర్మన్ నాతాని, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య బహుమతులు అందించారు. ఫ్లోర్ బాల్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ ఎం.కిషోర్‌బాబు, పాఠశాల ఇన్‌చార్జి కోట బాపూజీ పాల్గొన్నారు.

రెంటచింతలలో చోరీ

బంగారు అభరణాలు..నగదు అపహరణ



రెంటచింతల: రెంటచింతలలోని రేంజర్‌గారి బజారులో జరిగిన భారీ చోరీ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక రేంజర్‌గారి బజారులో నివసిస్తున్న జెట్టిపాలెం ఏపీ మోడల్ స్కూల్ పాఠశాల ఉపాధ్యాయుడు గెల్లిపోగు జనార్ధనరావు మాచర్ల పట్టణంలో ఉంటున్న తన తల్లి మరియమ్మను చూడటానికి శనివారం భార్యతో కలిసి వెళ్లారు. తిరిగి సోమవారం వచ్చే సమయానికి ఇంటి తాళాలు పగులగొట్టి తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువాలో దాచిన 122 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ. 20 వేల నగదు దొంగలు అపహరించినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని కారంపూడి సీఐ టీవీ శ్రీనివాసరావు, ఎస్‌ఐ సీహెచ్ నాగార్జున పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షూటింగ్ బాల్ జిల్లా జట్ల ఎంపిక



సత్తెనపల్లి: జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ బాల, బాలికల జిల్లా జట్ల ఎంపికలు సత్తెనపల్లి మండలం గుడిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించారు. బాలుర విభాగంలో 80 మంది, బాలికల విభాగంలో 60 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెలలో నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో పాల్గొంటారని జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మువ్వా నరసింహారావు, ప్రధాన కార్యదర్శి కోనంకి కిరణ్ కుమార్ తెలిపారు.

బాలుర జట్టుకు: కె.వెంకట్, జి.నవీన్, పి.మోబిన్, బి.రిషి, జి.వెంకటేష్, షేక్.అబ్దుల్, ఎం.హఫీజ్, ఎం.మహీధర్, కె.ప్రవీణ్, జి.మాంజి, కె.సుధీర్, ఎస్.భార్గవ్‌లు ఎంపికయ్యారు.

బాలికల జట్టుకు: యమ్.విజయ పరిమళ, కె.హిమ బిందు, జె.లక్ష్మి కీర్తన, జె.యశస్విని, పి.మేఘన, పి.సుచరిత, ఎం.నందిని, సిహెచ్.అక్షర, కె.హర్షిత, టి.సింధు, ఎం.జ్యోతిక, ఎస్.మధులు ఎంపికయ్యారు. వ్యాయామ ఉపాధ్యాయులు లాకు పిచ్చయ్య, బి.అనీల్‌దత్తానాయక్, షేక్.మెహబూబి, బి.తులసీరామ్‌నాయక్, ఎ.చిన్నయ్య, తిరుపతమ్మ, రత్నాకర్, యమ్.ప్రసన్న, పి.శివరామకృష్ణ ఎంపిక కార్యక్రమంలో పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలపై స్పెషల్ డ్రైవ్

నరసరావుపేటరూరల్: రోడ్డు ప్రమాదాల నుంచి ప్రజల విలువైన ప్రాణాలను కాపాడేందుకు ట్రాఫిక్ ఉల్లంఘనకు పాల్పడే ద్విచక్ర వాహనాలపై ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఆదేశాల మేరకు జిల్లాలో డ్రైవ్ కొనసాగుతుందన్నారు.

క్వారీ అనుమతులు రద్దు చేయాలి

డిమాండ్ చేసిన పౌరహక్కులు, ప్రజాసంఘాల నాయకులు



చికిత్స పొందుతున్న కార్మికులను పరామర్శిస్తున్న పౌరహక్కులు, ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట: బాపట్ల జిల్లా బల్లికురవ క్వారీలో భద్రత చర్యలు తీసుకోని యాజమాన్యంపై చర్యలు తీసుకుని అనుమతులు రద్దు చేయాలని పౌరహక్కులు, ప్రజాసంఘాల నాయకులు కోరారు. సంబంధిత శాఖల అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ ప్రమాదం జరిగిందని, వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని, మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1కోటి నష్ట పరిహారం ఇవ్వాలని, క్షతగాత్రులకు రూ.25 లక్షలు చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. సోమవారం క్వారీ ప్రమాద స్థలంతో పాటు నరసరావుపేట పట్టణంలోని ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాధితులను పౌర హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్, పీడీఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు నరసరావుపేటలో మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులకు మించి క్వారీలో లోతులోకి వెళ్లి తవ్వకాలు పెద్ద ఎత్తున చేపట్టారని అన్నారు. ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తే క్వారీ యజమానులు ఎలాంటి భద్రత చర్యలు తీసుకున్నట్లు ఆధారాలు కన్పించట్లేదన్నారు. రెవెన్యూ, కార్మిక శాఖ, మైనింగ్ శాఖ పర్యవేక్షణ లోపించడం వలన ఇలాంటి ప్రమాదాలు తరచూ సంభవిస్తున్నాయని అన్నారు.

పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు కృషి



బాపట్ల అర్బన్: పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం ఓఎస్‌డీ వెంకటకృష్ణ పేర్కొన్నారు. బాపట్ల డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కార్యాలయాన్ని ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇ.టి.సి ప్రిన్సిపాల్ డి.వెంకటరావు, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ, ఇ.ఇ.పీఆర్ వేణుగోపాల్‌రెడ్డి, బాపట్ల, రేపల్లె, చీరాల డి.డి.వొలు విజయలక్ష్మి, పద్మ, పద్మావతి, ఎంపీడీవో బాబురావు, డి.ఇ.పి.ఆర్. పి.రాజన్న, ఏఈ పి.ఆర్.మోహన్‌రావు పాల్గొన్నారు.

బాపట్ల: గ్రామాభివృద్ధిలో ఎంపీడీవోల పాత్ర కీలకమని వెంకటకృష్ణ పేర్కొన్నారు. కృష్ణ, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలో ప్రమోషన్ పొందిన ఎంపీడీవోల ఒక నెల శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడానికి కృషి చేయాలని ఆయన సూచించారు. శిక్షణ పొందిన ఎంపీడీవోలు వారికి కేటాయించిన మండలాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాలని కోరారు. ఈటీసీ ప్రిన్సిపాల్ డి.వెంకట్రావు, వైస్ ప్రిన్సిపాల్ పి.పద్మజ, శిక్షణలో 48 మంది ఎంపీడీవోలు పాల్గొన్నారు.